# తస్మాత్ జాగ్రత్త!

కొందరికి స్వవిషయాల్లోకంటె, పరాయి విషయాల్లోనే ఆసక్తి అధికం. అది వారి సహజ ప్రవృత్తి. అటువంటి వ్యక్తుల్లో తులశమ్మ ఒకరు.

తులశమ్మకి యింట్లో తీరిగ్గా కూచోవడం చాలా విసుగ్గా వుంటుంది. ఎందుకూ అంటే యింటిపనులన్నీ కోడలూ, కూతురూ చూసుకుంటారన్న ధీమా వుండటంవల్ల. ఆ విసుగును పోగొట్టుకుందుకు యిరుగు పొరుగు యిళ్ళకు వెళ్ళి వాళ్ళ విషయాల్లో జోక్యం కలిగించుకోకపోతే, తిన్నతిండి జీర్ణం అయినట్టే వుండదు పాపం ఆమెకి!

తులశమ్మగారింటికి యెదురుగా వుంది పద్మగారిల్లు. ఎవరింటికీ వెళ్ళినా వెళ్ళకపోయినా పద్మగారింటికి వెళ్ళడం ఒక దినచర్యగా మారింది తులశమ్మకి. తులశమ్మ వచ్చినపుడల్లా కాఫీ - వీలైతే టిఫినుతోపాటు యిస్తూ వుండేది పద్మ. అందుకు ప్రతిగా పద్మను ఆకాశానికి యెత్తేస్తుండేది తులశమ్మ ముఖస్తుతిగ.

పద్మభర్త రాజేశ్వర్రావు ప్రయివేటు ఫర్మ్‌లో వుద్యోగం చేస్తున్నాడు. ఆర్థికంగా వాళ్ళకి యిబ్బందేమీలేదు. పద్మ

చాలా అమాయకురాలు. ఆమె యెవరేం చెబితే అదే నమ్మేస్తుంది. ఇదో గొప్ప బలహీనత ఆమెలో. ఆ బలహీనత వుందిగనుకనే తులశమ్మ మాటకు విలువ తగ్గలేదు.

ఒకరోజు పద్మ మధ్యాహ్నం భోజనం ముగించి చాప మీద చేరబడింది. తన అటెండెన్సు యెంతో అవసరమైనట్టుగా అప్పుడే వూడిపడింది తులశమ్మ. "అమ్మాయ్ పద్మా: నిద్ర పోతున్నావా యేమిటి?" సవినయంగా, ఆప్యాయంగా అంది లోపలికివస్తూ.

పద్మ లేచికూచుంది. "లేదు పిన్నిగారూ! విశ్రాంతి కోసం అలా చేరబడ్డానంతే. రండి... కూచోండి..."

తులశమ్మ మందహాసం చిందిస్తూ పద్మకి అభిముఖంగా కూచుంది.

"ఈవేళ నెలకి కావాల్సిన సామాను తెప్పించానమ్మా. అవన్నీ సర్దుకొని వచ్చేసరికి ఇంతవేళయ్యింది. అయినా పద్మా, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి సుమా. ఇంటి ఖర్చంతా నా చేతుల మీదుగానే జరుగుతుందా, యేమిటో తెచ్చుకున్న జీతం యెటుకీ చాలనట్టు వుంటుంది."

"ఇంటి ఖర్చంతా మీరే చేస్తారన్నమాట పిన్నిగారూ?" కాస్తంత ఆసక్తితో అడిగింది.

"ఔనమ్మా! అదేమిటి అలా అడుగుతున్నావు, యిదో వింత విషయంలా? ఏం- మీ ఇంటిఖర్చులు నువ్వు చెయ్యడం లేదూ?"

"లేదు పిన్నిగారూ, అవన్నీ మావారే చూసుకుంటారు. ఆ బాధ్యత, నాకో పెద్ద బరువులా తోస్తుంది."

తులశమ్మ ఆమెకేసి అదోలా చూసింది. "అంతేనా! లేక మీ ఆయనకి నీ మీద నమ్మకంలేక ఆ బాధ్యత నీ మీద పెట్టలేదా?"

ఎవరికి యెలా చుర్రుమన్పించడమో, తులశమ్మకి తెలుసు. కాని, పద్మ విషయంలో ఆమె ప్రయత్నం వమ్మయ్యిందనే చెప్పాలి. ఆమె ప్రశ్నకి పద్మ అభిమానం దెబ్బ తినలేదు. ఆవేశం రేకెత్తలేదు.

"అబ్బే, అటువంటిదేమీ లేదు. మావారు నన్ను నమ్మకపోవడమేమిటి? అసలు నాకే యిష్టంలేదు."

తులశమ్మ సన్నగా నవ్వింది. ఆమె నవ్వులోని గూఢార్థం యేమిటో బోధపడలేదు పద్మకి. అమాయకంగా ఆమెకేసి చూస్తోంది.

"నువ్వు చాలా అమాయకురాలివి, పద్మా! మీ వారి అభిప్రాయం అదే అయినా, నీతో నిజం చెప్తాడా చెప్పు? ఈ రోజుల్లో ప్రతిస్త్రీ ఇంటిపెత్తనం తన చేతుల్లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తుంటే, నువ్వు అందుకు విరుద్ధంగా వున్నందుకు నేనే ఆశ్చర్యపోతున్నాను. అందుకే, అమాయకురాలి వంటాను. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఇకనైనా నువ్వు యింటిపెత్తనం నీమీద వేసుకోవాలి. మగ మహారాజులకేం?

వారికి బాధ్యత తెలీదు. నాలుగురాళ్ళు వెనక వేసుకోవాలన్న ఆలోచనే వారికి ఉండదు. నిజానికి ఆ సంకల్పం, పట్టుదల, ఆడవారికి వుండాలి. అందుకే భార్యను "గృహలక్ష్మి" అన్నారు పూర్వులు. నేను చెప్తున్నానని కాదమ్మా! నువ్వే కాస్త ఆలోచించు. ఇంటి ఔన్నత్యం విషయంలో ఆడవాళ్ళకే యెక్కువ బాధ్యత వుంది." నచ్చజెప్పే ధోరణిలో చెప్పుకుపోయింది తులశమ్మ.

పద్మకి, తులశమ్మ చెప్పినదాంట్లో, అసత్యం స్ఫురించలేదు. "బహుశా అందుకేనేమో చాలా యిళ్ళల్లో ఆడవారి అజమాయిషీ వుంటుంది" అని అనుకోకుండా వుండలేకపోయింది.

"ఏమిటి పద్మా, యేమిటలా ఆలోచిస్తున్నావు? ఇందులో నా స్వార్థం యేమన్నా వుందని నీకు అనుమానంగా వుందా?" మళ్ళీ అంది తులశమ్మ, పద్మకి ఆలోచించే అవకాశం యివ్వకుండా.

"అబ్బే, ఆ విధమైన అనుమానానికి ఆస్కారమేలేదు పిన్నిగారూ! ఆలోచిస్తూవుంటే మీరు చెప్పింది సత్యానికి దూరం కాదేమో ననిపిస్తోంది" అంది పద్మ సాలోచనగా.

తులశమ్మ హృదయం ఆనందంతో వుప్పొంగిపోయింది. తన ప్రయత్నం యెప్పుడూ వృథాకాకుండా వుండాలనే ఆమె తాపత్రయమంతాను. పద్మ యింటిపెత్తనం వహిస్తే తనకి ఒరిగిందేమీ లేదని ఆమెకి తెలుసు. అయినా సరే పద్మభర్త, పద్మకి పెద్దరికం యిస్తాడో లేదోనన్న విషయం తేల్చుకుందుకే

యీ ప్రయత్నం. ఆమెకి సంబంధించిన విషయం కాకపోయినా అదో విధమైన ఆనందం. ఒకవేళ యీ విధంగా ఆ దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగితే, తనుచూసి సంతోషించడం మొదటి విజయం. రెండోది యేమిటంటే, వాళ్ళిద్దరికీ యేదో విధంగా నచ్చజెప్పి తన పెద్దరికం నిలబెట్టుకుందుకు అవకాశం దొరకడం రెండో విజయం. ఇదీ ఆమె ఆంతర్యం! ఆమెకి యిదో వినోదంగా తోస్తోంది మరి!

ఆరోజు పద్మ టిఫినూ, కాఫీ యిచ్చింది తులశమ్మకి. తులశమ్మ వెళ్ళిపోయింది. కాని పద్మలో ఆలోచనలు రేపి వెళ్ళిపోయింది. పద్మ యెంతోసేపు ఆలోచించింది. ఎంత ఆలోచించినా తులశమ్మ చెప్పింది సబబుగానే కనిపించింది. తమ శ్రేయోభిలాషిణిగానే తులశమ్మను గుర్తించింది.

ఆరాత్రే రాజేశ్వర్రావు భోంచేస్తూవుంటే, పద్మ మాటల సందర్భంలో అంది, "ఈనెలనుంచీ యింటిఖర్చులు నేనే చూసుకుంటానండీ!" అని.

భార్య హఠాత్తుగ యీ విషయం ప్రస్తావించడం, రాజేశ్వర్రావుకి ఆశ్చర్యమే కలిగించింది. ఆమెకేసి విస్తుపోయి చూశాడు.

"అదేమిటి పద్మా! నీ మనస్తత్వం నాకు అర్థంకావడం లేదు. ఇంటిఖర్చువిషయం నిన్నే చూసుకోమనీ, నా బాధ్యత అవసరం లేదనీ యెన్నోసార్లు యింతకు ముందు చెప్పాను.

అప్పుడు నిరాకరించిన వ్యక్తివి, యిప్పుడు అకస్మాత్తుగా అడగడంలో ఆంతర్యం యేమిటో బోధపడ్డంలేదు" అన్నాడు.

పద్మ సందిగ్ధంలో పడింది. నిజమే! ఎన్నోసార్లు తనకి ఆ బాధ్యత తీసుకోమని ఆయన చెప్పారు. కాని, అప్పట్లో తనే నిరాకరించింది. అటువంటిది యిప్పుడేం చెప్పడమూ అని ఆలోచించసాగింది. "అప్పట్లో నిరాకరించినమాట వాస్తవమే నండీ. కాని, మీరు ఖర్చు చెబుతూవుంటే ఒక్క పైసాఅయినా, వెనకేసుకోలేక పోతున్నాం. నేను ప్రయత్నిస్తే ఫలితం వుంటుందేమో చూడాలనే నా ఆకాంక్ష." నిజాన్ని దాచి చెప్పింది.

రాజేశ్వరరావు భార్య మాటల్ని నిజంగా నమ్మలేక పోయాడు.

"ఈ ఆలోచన యిప్పుడే నీలో యెందుకు కలగాలి? నేను నమ్మను. ఏదో కారణం వుంటుంది."

"కారణం ఏముంటుందండీ?"

"నిజం చెప్పు పద్మా! ఈ ఆలోచన నీలో స్వతహాగా కలిగిందికాదు. అది ఖాయం! చెప్పు, ఈ సలహా యెవరిచ్చారో?" గంభీరంగా అడిగాడు ఈసారి.

పద్మ భర్తలో అంత గంభీరత యెప్పుడూ చూళ్ళేదు. అందుకే కాస్తంత కలవరపడింది. నిజంచెప్పక తప్పదనుకొంది. పద్మ ఆలోచనలో పడ్డం రాజేశ్వరరావుకి యేమీ అర్థంకాలేదు.

"ఏమిటా ఆలోచన పద్మా? నా దగ్గర యెందుకా సంకోచం చెప్పు. ఇంటిపెత్తనం నీ నెత్తిన పెట్టడానికి నాకు యేనాడూ అభ్యంతరంలేదు. కాని యితరుల సలహాలు మనం చెవిన వేసుకుంటే భవిష్యత్తులో ముప్పువుంది. అందుకే నిజం దాచకుండ చెప్పు"—

పద్మ మెత్తబడింది. నిజం చేప్పేయాలనుకుంది.

"మీా వూహ నిజమేనండీ" నెమ్మదిగా అంది పద్మ. "తులశమ్మ పిన్నిగారు చెప్పారండీ. ఇంటి పెత్తనం నేను తీసుకుంటే, కాస్తంత వెనకేసుకోవచ్చునని అంటోంది. అందుకే, నేనూ అంటున్నాను. ఇన్నాళ్లూ నిరాకరించిన బాధ్యత యిప్పుడు నెత్తిన వేసుకోడానికి యిదే కారణమండీ."

రాజేశ్వర్రావు గట్టిగా నిశ్వాసం వదిలాడు. అతనికి తులశమ్మమీాద పట్టరాని కోపం వచ్చింది.

"ఊఁ అలా చెప్పు. నేను మొదటే ఊహించాను పద్మా. నీకు ఆ సలహాయిచ్చింది ఆమేనని. అందుకే నేను అంటుంటాను. ఏదో, యెప్పుడో స్నేహరీత్యా యింటికివచ్చి కూర్చుంటే పరవాలేదుగాని, రోజూ అదేపనిగవచ్చి తిష్టవేసే వ్యక్తులంటే, నాకు పరమ అసహ్యమని; కాని, నువ్వు విన్పించుకోవుగదా! తిన్నతిండి, యెట్లా జీర్ణమవుతుంది మరి! అందుకే యిటువంటి సలహాలన్నీ యిచ్చుకుంటూ, నీలాంటి అమాయ

కుల దగ్గర మంచివాళ్ళనిపించుకుంటారు; అది మనం అర్థంచేసుకుంటేకదూ!" అని కోపంతో అన్నాడు.

"మన మంచికే చెప్పింది కదండీ! ఎందుకలా కోపగించుకుంటారు?"

"మన మంచి మనకి తెలీదా ఏమిటి, పద్మా? అసలు మన స్వవిషయాల్లో ఆమె జోక్యం కలుగజేసుకుందుకు, ఆమెకి యేం హక్కుంది చెప్పు. అక్కడికి నేను దుబారా ఖర్చులు చేస్తున్నట్లూ, నువ్వయితే జాగ్రత్తగా ఖర్చుపెట్టగలవన్నట్లూ ఆమె చెబితే, ఆమె మాటల్ని నువ్వు యెట్లా నమ్మగలిగావో నాకు అవగాహన కావడంలేదు. ఒక్కవిషయం చెప్తాను పద్మా! తులశమ్మ యే యెండకి ఆ గొడుగు పట్టేరకపు మనిషి. నీదగ్గర మంచి సంపాదించడానికి, నీకు అనుకూలంగా మాట్లాడుతోంది. అదే నా దగ్గర నీ పరోక్షంలో మాట్లాడవల్సివస్తే, నాకు అనుకూలంగా మాట్లాడి, నిన్ను విమర్శిస్తుంది. ఇదీ ఆమె తత్వం. ఇటువంటి తత్వంగల వ్యక్తులు చాలా ప్రమాదకరమైన వాళ్ళు. అది మనం అర్థంచేసుకుని, వాళ్ళని దూరంగా ఉంచాలంటాను."

"అలా అనకండీ! తులశమ్మపిన్ని చాలా మంచిమనిషి."

"ఆఁ ఆఁ మంచిమనిషే! ఇచ్చకపు కబుర్లు ఆడినవాళ్లంతా మంచివాళ్ళే! సమయం వస్తేనేగాని, వారి నిజరూపం బైటపడదు. ఇంతెందుకు? ఆమె మన స్తత్వాన్ని నీకు తెలియ

జెయ్యడానికి రేపు నేను యింట్లోనే వుంటానుండు. తులశమ్మతో నువ్వు మ్యాటినీ సినీమాకి వెళ్ళావని చెప్తాను. నువ్వు ప్రక్కగదిలో వుండి అంతా వింటూ వుండు. అప్పుడే నీకు అర్థమవుతుంది, ఆమె యెట్లాంటిదో !"

తులశమ్మను శంకించలేని పద్మకి యిది మంచి ప్లానేనని తోచింది.

"అలా అన్నారు బావుంది. ఆమె తత్వం తెలుసుకుందుకు యిదో చక్కని ప్లానుసుమండీ; సరే, ఆ విషయం రేపుచూద్దాం. మీరు భోజనంచెయ్యండి" అంది పద్మ, అక్కడితో ఆప్రస్తావన కట్టిపెడుతూ. రాజేశ్వర్రావు భోజనానికి వుపక్రమించాడు.

*　　　　*　　　　*

మరునాడు మధ్యాహ్నం రాజేశ్వర్రావు ప్లాను ప్రకారం, పద్మ ప్రక్కగదిలో తలుపులు వేసుకుని, ద్వారం దగ్గరే కూర్చుంది.

ఉద్యోగం చేస్తున్న వాళ్ళయినా, ఒక్కోసారి వేళకి వెళ్ళలేకపోతారుగాని, తులశమ్మ మాత్రం తన అటెండెన్సుకి యెప్పుడూ లేటవ్వదు. మామూలు వేళకి వచ్చింది పద్మయింటికి. రాజేశ్వర్రావు కనబడే సరికి, ఆమెలో కాస్తంత నిరుత్సాహం కలిగింది.

"ఏం బాబూ, యివ్వాళ సెలవు పెట్టారా?" అంది సవినయంగా.

"ఔనమ్మా! ఈవేళ పద్మ సినిమాకి వెళ్ళింది. ఇంట్లో యెవరూ వుండకపోతే, రోజులు బావులేవు కదా! అందుకే సెలవు పెట్టాను. కూర్చోండి..." సాదరంగా అన్నాడు. ఆమె పట్ల ఆతనికి ద్వేషం వున్నా, ఆక్షణంలో ఆదరణ చూపించక తప్పలేదు.

"సినీమాకి వెళ్ళిందా? నాతో ఆవిషయం చెప్పలేదే!" ఆశ్చర్యంగా అంది.

"అర్జంటుగా వెళ్ళిపోయింది లెండి— స్నేహితురాలు పట్టుబడితేనూ: అయినా, యిప్పుడు యింటిఖర్చులన్నీ ఆమే చేస్తుందిగా; డబ్బుకేం కొదవ? చీటికీ మాటికీ సినీమాలే. ఏమన్నా అంటే మనస్పర్థలు వస్తాయి. యెంత వూరుకుంటున్నా మరీ మించిపోతోంది..."

"ఏమిటి బాబూ, ఇంటిపెత్తనం ఆమెదేనా?" తనతో అబద్ధం చెప్పిందేమోనన్న దుగ్ధతో అడిగింది.

"ఔనమ్మా! ఇప్పుడా? చాలా రోజుల్నించి ఖర్చు పెడుతోంది."

"నాతో అలా చెప్పలేదే?"

"ఎట్లా చెప్పగలదు? ఇంటి యజమాని పెత్తనం లేకుండా, యిల్లాలి పెత్తనం యేమిటి? మీరంతా ఆశ్చర్యపోయి, చెక్కిళ్ళు నొక్కుకుంటారేమోనని చెప్పలేదేమో!"

పద్మ తనతో అబద్ధం చెప్పినందుకు కోపం వచ్చింది తులశమ్మకి.

“అయినా బాబూ నువ్వా అట్లాంటివాడివే. ఆమె చేతిలో పెత్తనం ఉండడ మేమిటి? అందు కేగామోసు, ఇటీవల మరీ విపరీతంగా ఖర్చుపెడుతోంది. ఏమిటో అనుకున్నాను సుమా! వీధిలోకి యేదైనా రావడం తరువాయి, వెంటనే పిల్చి కొనేస్తుంది. అంత దుబారాఖర్చులయితే యెట్లా బాగు పడుతుంది చెప్పు? నువ్వు యింత అజాగ్రత్తగా వుంటావనుకో లేదు సుమా! ఇప్పటికైనా మించిపోయింది లేదు బాబూ! పెత్తనం నీచేతిలోకి తీసుకో. భవిష్యత్తు చూచుకోవడం నీవంతు. ఆమెకేం పోయింది? గడించి తెస్తున్నావు గాబట్టి, ఖర్చు పెడుతోంది. చెప్పున్నానని మరేం అనుకోకు నాయనా! మీ యింటి శ్రేయస్సుకోరే చెబుతున్నాను. ఆఁ...” అంటూ ముగించింది.

రాజేశ్వర్రావు వుధృతంగా వస్తున్న నవ్వును ఆపుకున్నాడు. పద్మకి చెప్పలేనంత కోపం వచ్చింది. మొహం యెర్రబడింది. భర్త అబద్ధం చెప్పలేదనుకుంది. తన తెలివి తక్కువతనానికి తనే సిగ్గుపడింది. ఇంక ఆ గదిలో వుండలేక పోయింది. విసురుగా తలుపు తెరుచుకుని వచ్చింది.

"ఏం పిన్నిగారూ! అంతా మా యింటి శ్రేయస్సుకోశే చెబుతున్నారా?" కోపంగా అంది.

తులశమ్మ తెల్లబోయింది. ఆమె మొహంలో కత్తి వేటుకి నెత్తురుచుక్క లేదు.

"సినిమాకి వెళ్ళలేదూ పద్మా?" అంది విస్తుపోతూ. ఆమె గొంతు బొంగురు పోయింది. ఎందుకో ఆమెకి గాభరా పుట్టింది.

"ఈ సినిమా చూశాంగా పిన్నిగారూ! ఇంక యెప్పుడూ ఇటువంటి నాటకాలాడకండి. సుఖంగా సాగుతున్న సంసారాల్లో చిచ్చు రగల్చకండి. ఇంకచాలు మీస్నేహం. మా యింటికి యెప్పుడూ రాకండి. వెళ్ళండిక..." కోపంగా అంది పద్మ.

తులశమ్మకి కాళ్ళు వణికాయి. మారు మాటాడకుండా అక్కణ్ణించి నిష్క్రమించింది.

రాజేశ్వరరావు గట్టిగా నవ్వుకున్నాడు. "ఇప్పుడర్థ మయ్యిందా పద్మా?"

"క్షమించండి! తులశమ్మ యిటువంటి మనిషని నేను అనుకోలేదు" అంది పశ్చాత్తాపంతో.

"మాటల్ని బట్టి మంచితనం వ్యక్తమవ్వదు పద్మా! మనసు తెలుసుకుందుకు ప్రయత్నించాలి."

"ఇప్పుడు తెలుసుకున్నానుగా? ఇక జాగ్రత్త పడతాను..." చిన్నగా నవ్వుతూ అంది పద్మ.

"అయితే యీనెల నుంచే యింటి ఖర్చులు నువ్వే చెయ్యి..." ఆమె మొహంలోకి చిలిపిగా చూస్తూ అన్నాడు.

"అబ్బెబ్బే! వద్దండీ! నాకా బాధ్యత వద్దు." నవ్వుతుంది.

రాజేశ్వర్రావు నవ్వకుండా వుండలేకపోయాడు.